సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 19 । మార్చి । 2023



రేటింగ్ ప్లీజ్

సిద్దిపేట పట్టణంలో రెస్టారెంట్ నిర్వాహకులు వినూత్న పద్ధతిని అనుసరిస్తున్నారు. కస్టమర్ల నుంచి తీసుకున్న ఫీడ్‌బ్యాక్‌ను పేపర్ పై రాసి చెట్టుకు స్టిక్ చేస్తున్నారు. 8లో..



ఆ చైన్‌స్నాచర్లు దొరికారు 8లో..

రామాయంపేటలో మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన ఇద్దరు చైన్ స్నాచర్లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.



'బెల్ట్' దందాను అరికట్టాలి

గ్రామాల్లో బెల్ట్‌షాపులతో గొడవలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని సదాశివపేట మండల సమావేశంలో సభ్యులు అన్నారు. 9లో

న్యూస్‌రీల్

రాములోరి తలంబ్రాలు నేరుగా ఇంటికే..



తలంబ్రాలను బుక్ చేస్తున్న భక్తులు

సంగారెడ్డి టౌన్: భద్రాచలం సీతారాముల దేవస్థానంలో నిర్వహించే సీతారాముల కల్యాణోత్సవ తలంబ్రాలను ఆర్టీసీ ద్వారా ఇంటికి తెప్పించుకునే అవకాశం ఉందని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎస్ సుదర్శన్ తెలిపారు. ఒక ప్యాకెట్‌కు రూ.116 చెల్లించి ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ద్వారా బుక్ చేయించుకోవాలన్నారు. శనివారం ఆర్టీసీ డిపోలో బుకింగ్ కౌంటర్‌ను ప్రారంభించారు. మెదక్, నారాయణఖేడ్, సంగారెడ్డి, జహీరాబాద్, సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్ డిపోలలో సంప్రదించాలన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న విజయ

జిన్నారం(పటాన్‌చెరు): పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు విద్యను అభ్యసించాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు తగిన చర్యలు చేపట్టాలని విద్యాశాఖ జిల్లా అదనపు డైరెక్టర్ విజయ సూచించారు. జిన్నారం మండలంలోని బొల్లారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంచి ఫలితాల సాధనపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన విజయ మాట్లాడుతూ వందశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు పట్టుదలతో చదవాలన్నారు. పదో తరగతి విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు శ్రద్ధ చూపాలని, విద్యార్థులకు ఎలాంటి సందేహాలున్నా వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మంగీలాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగో రోజు 96.90 శాతం హాజరు

కొండాపూర్(సంగారెడ్డి): ఇంటర్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్‌రాం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 15,559 విద్యార్థులకు గానూ 15,076 మంది హాజరు కాగా 483 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. వీరిలో జనరల్ విద్యార్థులు 14,277 మందికి గానూ 13,859 హాజరు కాగా 418 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ విభాగంలో 1,282 మంది విద్యార్థులకు 1,217 హాజరు కాగా 65 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఇంగ్లిష్ పరీక్షకు 96.90 శాతం విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్‌రాం నాలుగు, డీఈసీ సభ్యులు ఐదు, హెచ్‌పీసీ సభ్యులు నాలుగు, ఫ్లయింగ్ స్క్వాడ్స్ పది, సిట్టింగ్స్ స్క్వాడ్స్ నాలుగు కేంద్రాలను తనిఖీ చేశారు.

ముగ్గురికి కరోనా



పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం 22 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించగా అందులో ముగ్గురికి పాజిటివ్ వచ్చినట్లు టెస్టుల నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు 20 మందికి నిర్వహించినట్లు పేర్కొన్నారు.

రాజీయే రాజమార్గం

మెదక్‌జోన్: చిన్నపాటి కేసులతో కోర్టులు, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగడం కన్నా రాజీయే మంచిదని మెదక్ జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద అన్నారు. శనివారం జిల్లా కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. పలు మోటార్ వెహికిల్ కేసులతో పాటు బ్యాంకులకు సంబంధించిన కక్షిదారులు రాజీపడ్డారు. మోటార్ వెహికల్స్‌కు సంబంధించి బీమా కంపెనీ వారు మూడు కేసులు కక్షిదారులతో రాజీపడి లబ్ధిదారులకు రూ. 27.63 లక్షలు చెల్లించారు. అలాగే ఐదు బ్యాంకు రికవరీ కేసులను పరిష్కరించారు. సదస్సులో లోక్ అదాలత్, లీగల్ సర్వీసెస్, ఉమెన్స్, చైల్డ్ రైట్స్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ అధికారి జితేందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆగని వడగళ్లు

రెండో రోజూ వీడని వర్షం
- రాయ్‌కోడ్‌లో అత్యధికంగా 7.5 సెం.మీ. వర్షపాతం నమోదు



జహీరాబాద్ టౌన్: దెబ్బతిన్న బొప్పాయి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: అకాల వర్షాలు రెండో రోజు కూడా కొనసాగాయి. శనివారం జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల వర్షం కురిసింది. అక్కడక్కడ వడగళ్ల వాన పడింది. శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమైన వాన రాత్రి వరకు కొనసాగింది. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో వర్షపాతం రికార్డయింది. సగటున 1.8 సెం.మీల వర్షపాతం నమోదు కాగా, అత్యధికంగా రాయ్‌కోడ్‌లో 7.5 సెం.మీల వర్షం కురిసింది.

- వట్‌పల్లి, సిర్గాపూర్, అమీన్‌పూర్, రామచంద్రాపురం, నారాయణఖేడ్, హత్నూర మండలాల్లో ఒక సెం.మీలోపు వర్షపాతం నమోదైంది. జిల్లాలో శనివారం ఉదయం ఎనిమిది గంటలకు రాయ్‌కోడ్‌లో 7.5 సెం.మీ.లు, పుల్కల్‌లో 6.8 సెం.మీలు, నాగల్‌గిద్ద 6.3లో సెం.మీలు, కొండాపూర్‌లో 5.0 సెం.మీలు, న్యాల్‌కల్‌లో 4.3 సెం.మీలు, జహీరాబాద్(మల్చెల్మ) 3.9 సెం.మీలు, సదాశివపేట 2.5 సెం.మీలు, సంగారెడ్డి 1.3 సెం.మీలు, పటాన్‌చెరు(రుద్రారం) 1.2 సెం.మీలు, జహీరాబాద్ 1.2 సెం.మీలు, పటాన్‌చెరు(పాశమైలారం)లో 1.1 సెం.మీలు, కోహీర్(దిగ్వాల్) 1.0 సెం.మీలు వర్షపాతం నమోదైంది.



మిర్జాపూర్(ఎన్)లో దెబ్బతిన్న ఉల్లి పంట

న్యాల్‌కల్‌లో 117 ఎకరాలు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 88 మంది రైతులకు చెందిన 117 ఎకరాల్లో ఆయా పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. దెబ్బతిన్న పంటలను శనివారం ఉదయం ఏఈఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి దెబ్బతిన్న పంటల వివరాలను పరిశీలించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

సదాశివపేట(సంగారెడ్డి)/నారాయణఖేడ్: సదాశివపేట పట్టణంలో శనివారం సాయంత్రం 6 గంటలకు వడగళ్ల వర్షం కురిసింది. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అకాల వర్షాలతో మూడు రోజులుగా కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి. నారాయణఖేడ్ నియోజకవర్గం నాగల్‌గిద్ద మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి వడగళ్లతో కూడిన వర్షం కురిసింది.



సదాశివపేట పట్టణంలో కురుస్తున్న వర్షం



బిడెకన్నెలో రాలిపోయిన మామిడి కాయలు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

గంటపాటు ఏకధాటిగా..

ఝరాసంగం(జహీరాబాద్): ఝరాసంగంతో పాటు వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి జోరుగా వర్షం కురిసింది. మండల వ్యాప్తంగా 28.2మిమీల వర్షపాతం నమోదైంది. ఆయా గ్రామాల్లో కురిసిన వర్షానికి జొన్న 190 ఎకరాలు, మొక్కజొన్న 90 ఎకరాలు, శనగ 10 ఎకరాలు, మామిడి 70 ఎకరాలు, కూరగాయలు 22 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బిడెకన్నె గ్రామంలో దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారితో కలిసి ఎంపీపీ దేవదాసు పరిశీలించారు.



సజ్జారావుపేట తండాలో నేలకొరిగిన జొన్న పంట

దెబ్బతిన్న పంటలు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ వ్యవసాయ డివిజన్ పరిధిలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో యాసంగి పంటలు దెబ్బతిన్నాయి. జహీరాబాద్, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కోహీర్, మొగుడంపల్లి, జహీరాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో రాళ్ల వాన పడింది. జహీరాబాద్ డివిజన్‌లో 510 ఎకరాల్లో యాసంగి పంటలు, 100 ఎకరాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతినట్లు ఏడీఏ భిక్షపతి తెలిపారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రమణకుమార్

ఎస్పీ రమణకుమార్

సంగారెడ్డి టౌన్: నేరాలను తగ్గించడానికి సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎస్పీ రమణకుమార్ అన్నారు. శనివారం సంగారెడ్డి మండలంలోని ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామంలోని దుర్గాభవాని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో 6 లక్షల 35 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన 23 సీసీ కెమెరాలను సర్పంచ్ బక్క బలరాం మంజులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను, క్రైమ్ రేట్లను తగ్గించవచ్చన్నారు. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి సీసీ కెమెరాల రికార్డులు ఉపయోగపడతాయన్నారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎంపీటీసీ రఘు, ఉప సర్పంచ్ స్మిత శ్రీధర్, సీఐ శివలింగం, మనోహర్ గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు బ్రహ్మోత్సవాల ముగింపు



కొమురవెల్లిలో భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): మూడు నెలలపాటు సాగిన మల్లన్న జాతర సోమవారం అర్ధరాత్రి తర్వాత జరిగే అగ్నిగుండాల కార్యక్రమంతో ముగియనుంది. బ్రహ్మోత్సవాల్లో చివరి ఆదివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రతీ ఏడాది సంక్రాంతి తర్వాత వచ్చే ఆదివారంతో బ్రహ్మోత్సవాలు మొదలై ఉగాది ముందు వచ్చే ఆదివారంతో ముగుస్తాయి. ఆదివారం సాయంత్రం 7 గంటలకు వీరభద్ర ప్రస్థాయం, అనంతరం భద్రకాళిపూజ, రాత్రి 11 గంటలకు అగ్నిగుండాల ప్రజ్వలన, సోమవారం తెల్లవారు జామున 5 గంటలకు గురుపూజ, బలిహరణ తర్వాత అగ్నిగుండాల ప్రవేశం, విజయోత్సవం, ఉదయం 11 గంటలకు ఏకదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అగ్నిగుండ నిర్వహణకు అవసరమైన పంచ పల్లవాలను (మోదుగ, సంద్ర, మేడి, రావి, గంధం) 30 క్వింటాళ్లు సిద్ధం చేశారు. అగ్నిగుండాల కార్యక్రమం నిర్వహించే తోట బావి ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ఈఓ బాలాజీ, పాలకమండలి చైర్మన్ గీస భిక్షపతి తెలిపారు.

పటిష్ట బందోబస్తు

ఆలయంలో చివరి ఆదివారం నిర్వహించనున్న అగ్నిగుండాల కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్ తెలిపారు. శనివారం ట్రాఫిక్ ఏసీపీ ఫణిందర్‌తో కలిసి అగ్నిగుండాలు నిర్వహించే తోటబావి ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలు, క్యూలైన్‌లను పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో సుమారు 80 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామని, భక్తులు ఆలయ అధికారులు, పోలీసులకు సహకరించాలని కోరారు. ఆయనతో చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్ఐ చంద్రమోహన్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

పటాన్‌చెరు టౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టనున్న మజ్దూర్, కిసాన్ సంఘర్ష్ ర్యాలీని జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. శనివారం పటాన్‌చెరు శ్రామిక భవన్‌లో నిర్వహించిన కార్మిక సదస్సుకు హాజరై మాట్లాడారు. ఎనిమిదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను, ప్రజా వ్యతిరేక విధానాలను తక్షణమే విరమించుకోవాలన్నారు. కార్మికుల హక్కులు, కార్మిక చట్టాల రక్షణ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు, విద్యుత్ సవరణ బిల్లు 2022 ఉపసమరణ, కనీస వేతనం రూ.26 వేలు, ధరల పెరుగుదల, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని, తదితర డిమాండ్ల సాధన కోసం ఏప్రిల్ 5న లక్షలాది మందితో చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, రాజు, శేషగిరి, తిరుపతి, మనిరాజు ,మల్లేశ్, వివిధ పరిశ్రమల నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

'కమిషన్' సభ్యులు రాజీనామా చేయాలి



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి

కొండాపూర్(సంగారెడ్డి): టీఎస్‌పీఎస్‌సీ పరీక్ష పత్రాలు లీకయ్యాయని, దీనికి మంత్రులు కేటీఆర్, సబితాఇంద్రారెడ్డితో సహా కమిషన్ సభ్యులందరూ బాధ్యత వహిస్తూ తక్షణమే రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నాయకులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్‌సీ అధికారులు, తెలంగాణ ప్రభుత్వ వైఫల్యంతోనే లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. కేవలం బీఆర్ఎస్ నాయకుల అనుచరుల కోసం, రక్తసంబంధీకుల కోసమే ప్రశ్న పత్రాలను లీక్ చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మంత్‌రెడ్డి, నాయకులు కోవూరు సంగమేశ్వర్, గోదావరి అంజిరెడ్డి, జగన్నాథ్, జనార్దన్ రెడ్డి, పోచారం రాములు, సత్యనారాయణ, ఎడ్ల రమేశ్, రాజేశ్వర్ రావ్ దేశ్ పాండే, ఆకుల సాయికుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి



విద్యా సామగ్రి అందిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి విశ్వనాథ్

హైకోర్టు న్యాయమూర్తి విశ్వనాథ్

నారాయణఖేడ్: విద్యాభివృద్ధితోనే సమాజాభివృద్ధి సాధ్యమని హైకోర్టు న్యాయవాది విశ్వనాథ్ అన్నారు. నారాయణఖేడ్ మండలం ర్యాకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ఆయన సొంత ఖర్చులతో పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. తాను నాగ్‌ధర్ ప్రభుత్వ పాఠశాలలో చదివి ఇంతవరకు ఎదిగానని చెప్పారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను హైదరాబాద్‌లోని ప్రముఖ స్థలాలతో పాటు రామోజీ ఫిలింసిటీని చూపించి మంచి బహుమతులను అందజేస్తానని తెలిపారు. పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ జ్ఞానేశ్వర్, ఉపాధ్యాయులు నర్సింహులు, దత్తు, లక్ష్మణ్, పాండు, భూమయ్య, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

సీపీఆర్'పై శిక్షణ

- పోలీస్, మున్సిపల్, వైద్యారోగ్యశాఖ సిబ్బందికి అవగాహన
- ప్రజాప్రతినిధులు, నేషనల్‌హైవే అథారిటీ అధికారులకు సైతం..



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: నిర్విరామంగా పనిచేస్తూ శరీరభాగాలకు రక్త ప్రసరణ చేసే గుండె కొట్టుకోవడం ఆగిపోతే.. ఉన్నపలంగా కుప్పకూలిపోతే.. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఆ గుండెపై క్రమ పద్ధతిలో ఒత్తడం ద్వారా గుండెను తిరిగి పనిచేసేలా చేయడాన్ని వైద్యులు సీపీఆర్(కార్డియో పల్మనరీ రెస్యూసిటేషన్) అంటారు. నిండు ప్రాణాలను నిలబెట్టే ఈ సీపీఆర్‌పై విస్తృతంగా అవగాహన కల్పించాలని వైద్యారోగ్యశాఖ భావిస్తోంది.

- జిల్లాలో ఫ్రంట్ లైన్ వర్కర్లకు సీపీఆర్ విధానంపై శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో పోలీసులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది, నేషనల్ హైవే అథారిటీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, వివిధశాఖల అధికారులు ఇలా వివిధ వర్గాలవారికి శిక్షణ ఇవ్వనున్నారు.
- కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో ఒకరోజు శిక్షణ, అవగాహన కల్పించనున్నట్లు వైద్యారోగ్యశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఒకరోజు శిక్షణ అనంతరం పీసీఆర్‌పై మండల స్థాయి వరకు శిక్షణ ఇవ్వాలని వైద్యారోగ్యశాఖ భావిస్తోంది. ఏడుగురు వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తారు. త్వరలో నిర్వహించనున్న సీపీఆర్ శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు హాజరవుతారని ఆ శాఖ అధికారులు తెలిపారు.

ఏడుగురు వైద్యులతో..

సీపీఆర్ విధానంపై జిల్లాలో ఏడుగురు వైద్యులు ఇప్పటికే శిక్షణ తీసుకున్నారు. వీరు జిల్లాలో వివిధ వర్గాల వారికి సీపీఆర్‌పై శిక్షణ ఇస్తారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలనే దానిపై విస్తృతంగా అవగాహన కల్పిస్తారు. ఉన్నపలంగా ఓ వ్యక్తి కుప్పకూలిపోతే ఏం చేయాలి.. గుండె పనిచేయడం ఆగిపోయిందా.. లేదా? ఎలా తెలుసుకోవాలి.. అలాగే ఆగిపోయినట్లు అనిపిస్తే.. సీపీఆర్ ఎలా చేయాలి? వంటి అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని భావిస్తున్నారు. గుండెపోటుకు గురైన విపత్కర పరిస్థితుల్లో సరైన పద్ధతిలో సీపీఆర్ చేస్తే నిండు ప్రాణాలను నిలబెట్టవచ్చనే అంశంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. సీపీఆర్ చేస్తే 80 శాతం నుంచి 90 శాతం వరకు ప్రాణాలను నిలబెట్టవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

త్వరలో 'హాథ్‌సే హాథ్' జోడో

డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి

రామాయంపేట(మెదక్): త్వరలో జిల్లాలో హాథ్‌సే హాత్ జోడో యాత్ర నిర్వహించనున్నట్టు డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం కామారెడ్డిలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని కలిసి చర్చించారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో చేపట్టబోయే యాత్రపై ఇప్పటికే రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈసందర్భంగా జిల్లాలో పార్టీ పరిస్థితి, అసమ్మతి కార్యకలాపాలు చర్చకు వచ్చినట్టు సమాచారం. పాదయాత్ర పూర్తయిన తర్వాత మాట్లాడుదామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు తెలిసింది.

క్లుప్తంగా

బియ్యం బస్తాలపై ధర లేదని...

మహామార్ట్‌కు రూ 5వేలు జరిమానా

కోహెడ(హుస్నాబాద్‌): మండల కేంద్రంలోని మహామార్ట్‌లో లీగల్‌ మెట్రాలజీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి వినియోగదారులకు విక్రయిస్తున్న పలు వస్తువులను పరిశీలించారు. 25 కేజీ సన్న బియ్యం బ్యాగులను ధర లేకుండా విక్రయిస్తున్నారంటూ రూ.5వేలు జరిమానా విధించి, మహామార్ట్‌పై కేసు నమోదు చేశారు. ఎలక్ట్రానిక్‌ కాంటాలకు కూడా స్టాంపింగ్‌ లేకపోవడంతో నిర్వాహకులను మందలించారు. ప్రభుత్వ రుసుం తీసుకొని ఎలక్ట్రానిక్‌ కాంటాలకు స్టాంపింగ్‌ చేశారు.

మద్యం సేవించి..

పటాన్‌చెరుటౌన్‌: పడుకున్న చోటే ఓ వ్యక్తి మృతి చెందాడు. అమీన్‌పూర్‌ ఎస్‌ఐ గణేశ్‌ కథనం ప్రకారం.. బీరంగూడ మంజీరనగర్‌కు చెందిన దుర్గయ్య(41) కూలిపనులు చేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం మద్యం సేవించి ఇంటికొచ్చి పడుకున్నాడు. సాయంత్రం భార్య లక్ష్మి వచ్చి చూడగా పడుకున్న చోటే మృతిచెంది కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కడుపునొప్పి భరించలేక..

అక్కన్నపేట(హుస్నాబాద్‌): కడుపు నొప్పి భరించలేక ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ వివేక్‌ తెలిపిన వివరాల ప్రకారం... మండలపరిధిలోని మైసమ్మవాగు తండాకు చెందిన కొప్పుల శిరీష(22) కడుపునొప్పితో బాధపడుతోంది. శనివారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన హుస్నాబాద్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని చెప్పారు. మృతురాలి తల్లి కొప్పుల యాదవ్వ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


శివరాములు(ఫైల్‌)

పాపన్నపేట(మెదక్‌): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. ఎస్‌ఐ విజయ్‌ తెలిపిన వివరాల ప్రకారం...మండలపరిధిలోని కొడుపాకకు చెందిన పిట్ల శివరాములు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిస కాగా, భార్య గొడవపడింది. దీంతో మనస్తాపం చెందిన శివరాములు శుక్రవారం ఇంట్లో పురుగులమందు తాగి అపస్మారక స్థితికి వెళ్లాడు. మెదక్‌ ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం గాంధీకి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

రేటింగ్‌ ప్లీజ్‌

- కస్టమర్‌ ఫీడ్‌బ్యాక్‌పై దృష్టి
- కొందరు ఆన్‌లైన్‌లో.. మరికొందరు ఆఫ్‌లైన్‌లో

సాక్షి, సిద్దిపేట: ఆన్‌లైన్‌లో ఆర్డర్‌ చేసిన ఫుడ్‌ ఇంటికిరాగానే డెలివరీబాయ్‌ ముందుగా అడిగే మాట 'సార్‌.. మంచి రేటింగ్‌ ఇవ్వండని'...ఏదైనా షాప్‌నకు వెళ్లగానే ' సార్‌...మేడమ్‌.. మొబైల్‌కు లింక్‌ వస్తుంది ఫైవ్‌స్టార్‌ రేటింగ్‌ ఇవ్వండి' అంటున్నారు. కొన్ని వస్తువులు కొన్నా, రేటింగ్‌ కోసం ఫోన్‌కు సెకన్‌లో రిక్వెస్ట్‌ వస్తోంది. టెస్టు కోసం ల్యాబ్‌కు వెళ్లి రేటింగ్‌ ఇవ్వడం మర్చిపోతే ఫోన్‌ చేసి మరీ రేటింగ్‌ తీసుకుంటున్నారు. ప్రస్తుతం అన్నిరకాల సర్వీసుల్లోనూ ఇదే ట్రెండ్‌ కొనసాగుతోంది. రోడ్‌సైడ్‌ బిజినెస్‌ నుంచి రెస్టారెంట్ల దాకా, హోటళ్ల నుంచి హాస్పిటళ్ల దాకా రేటింగ్‌, రివ్యూ కోసం రిక్వెస్ట్‌ చేస్తున్నారు. ఒకప్పుడు మెట్రోనగరాలకే పరిమితమైన ఫీడ్‌ బ్యాక్‌ జిల్లా కేంద్రాలకు, మున్సిపాలిటీలకు కూడా పాకింది. కొనుగోళ్లు, బిజినెస్‌లను ఇవి అంతలా ఇంపాక్ట్‌ చేస్తున్నాయి. కస్టమర్లు కూడా రోజురోజుకు గూగుల్‌ రేటింగ్‌ చూసి ఆర్డర్‌ చేస్తున్నారు. చిన్నచిన్న పట్టణాలు మొదలు జిల్లా కేంద్రాల వరకు అన్ని రకాల వస్తువులు, రెస్టారెంట్‌లు, ఆస్పత్రులు అందుబాటులోకి వచ్చాయి. కస్టమర్‌ ఇచ్చే రేటింగ్‌ పైనే వ్యాపారం అభివృద్ధి చెందుతుండటంతో కొందరు నేరుగా, మరి కొందరు ఆన్‌లైన్‌లో ఫీడ్‌ బ్యాక్‌ తీసుకుంటున్నారు. నేరుగా ఫీడ్‌బ్యాక్‌ తీసుకునేందుకు కలర్‌ పేపర్‌ అందిస్తున్నారు. వాటిపై ఫుడ్‌ ఎలా ఉంది...రిసీవింగ్‌ ఎలా ఉంది.. సౌకర్యాలు ఎలా ఉన్నాయని... బాగుంటే బాగుందని, నచ్చకపోతే నచ్చలేదని రాయని కస్టమర్‌లను యజమానులు కోరుతున్నారు. కస్టమర్‌ రాసి ఇచ్చిన ఫీడ్‌ బ్యాక్‌ను వెంటనే ఫీడ్‌ బ్యాక్‌ బోర్డుపై స్టిక్‌ చేసుకున్నారు. కస్టమర్‌కు ఫుడ్‌ నచ్చకపోతే మరింత నాణ్యమైన రుచికరమైన ఫుడ్‌ అందించేందుకు యజమానులు ప్రయత్నిస్తున్నారు. ఆన్‌లైన్‌లో రేటింగ్‌ ఇవ్వాలని యజమానులు కోరుతున్నారు.


సిద్దిపేట పట్టణంలో ఓ రెస్టారెంట్‌ చెట్టుకు స్టిక్‌ చేసిన ఫీడ్‌ బ్యాక్‌

ఫీడ్‌ బ్యాక్‌ చూసే ఆర్డర్‌



సిద్దిపేటలో రెస్టారెంట్‌, హోటల్స్‌, ఆస్పత్రుల్లో కస్టమర్‌ ఫీడ్‌ తీసుకుంటున్నారు. ఇది మంచి సాంప్రదాయం. రెస్టారెంట్‌లో ఫుడ్‌ ఎలా ఉంటుంది అని యజమానులకు సైతం తెలుస్తుంది కాదా. మేము రాసిన ఫీడ్‌ బ్యాక్‌ వాల్‌కు స్టిక్‌ చేస్తున్నారు. ఏదైనా రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు అక్కడ ఫీడ్‌బ్యాక్‌ అన్ని చదివి ఆర్డర్‌ చేస్తున్నాం.

–సౌజన్య, సిద్దిపేట

ప్రతీ కస్టమర్‌ నుంచి తీసుకుంటున్నాం



మా రెస్టారెంట్‌కు వచ్చిన కస్టమర్‌ నుంచి ఫీడ్‌ బ్యాక్‌ తీసుకుంటున్నాం. పేపర్‌ పై రాసి ఇవ్వగానే మా రెస్టారెంట్‌లో ఉన్న చెట్టుకే స్టిక్‌ చేస్తున్నాం. యూత్‌ వస్తే తప్పకుండా అన్ని ఫీడ్‌ బ్యాక్‌లు చదువుతున్నారు. అందులో ఏ ఫుడ్‌ బాగుందని ఎక్కువమంది చెబితే అదే ఆర్డర్‌ చేస్తున్నారు. కస్టమర్‌ ఫీడ్‌బ్యాక్‌కు అనుగుణంగా ఫుడ్‌ అందిస్తున్నాం.

– అతిఫ్‌, రెస్టారెంట్‌ ఓనర్‌, సిద్దిపేట

ఆ చైన్‌స్నాచర్లు దొరికారు

- ఇద్దరూ పాత నేరస్తులే.. జైలులో పరిచయం
- బయటకు వచ్చాక కూడా మారని ప్రవర్తన
- వివరాలు వెల్లడించిన తూప్రాన్‌ డీఎస్పీ యాదగిరిరెడ్డి


చైన్‌స్నాచర్ల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి

రామాయంపేట(మెదక్‌): రామాయంపేటలోని బ్యాంకు వద్ద ఓ మహిళ మెడలోంచి బంగారు గొలుసును లాక్కెళ్లిన ఇద్దరు చైన్‌స్నాచర్లు దొరికారు. సర్కిల్‌ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తూప్రాన్‌ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. సుతారిపల్లికి చెందిన రాగి రాజమణి బ్యాంకు వద్ద శుక్రవారంనిల్చుండగా, ఇద్దరు బైక్‌పై వచ్చి మెడలోంచి గొలుసు లాక్కెళ్లిన విషయం విదితమే. సీసీ పుటేజీలో ఉన్న వివరాల ఆధారంగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కోనాపూర్‌ వద్ద ఎస్‌ఐ రంజిత్‌ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. అనుమానాస్పద స్థితిలో బైక్‌పై వేగంగా వెళుతున్న ఇద్దరిని పోలీసులు ఆపడానికి యత్నించారు. అయితే బైక్‌ ఆపకుండా వెళ్లడంతో పోలీసులు వారిని చేజ్‌ చేసి పట్టుకున్నారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా, చోరీలు గుట్టు రట్టయింది. పోలీసులకు పట్టుబడ్డ ఇద్దరిలో రంజిత్‌కుమార్‌ది అక్బర్‌పేట- భూంపల్లి మండలం పోతారెడ్డిపేట కాగా, దొమ్మాట సుధాకర్‌ది దుబ్బాక మండలంలోని దుంపలపల్లి. ఎనిమిది దొంగతనాలకు సంబంధించిన కేసుల్లో రంజిత్‌ నిందితుడు. సుధాకర్‌ రెండు అత్యాచార కేసుల్లో జైలుశిక్ష కూడా అనుభవించాడు. ఈ ఇద్దరికీ సిద్దిపేట జైలులో పరిచయం ఏర్పడింది. జైలు నుంచి బయటకు వచ్చాక, కూడా వీరి ప్రవర్తనలో మార్పు రాలేదు. ఇద్దరూ మళ్లీ దొంగతనాలకు తెగబడ్డారు. వారినుంచి బంగారు ఆభరణాలు, బైక్‌, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీసీ పుటేజీలో నిక్షిప్తమైన సమాచారం, ప్రజల సహకారంతో చైన్‌స్నాచర్లను గంటల వ్యవధిలోనే పట్టుకున్నామని డీఎస్పీ చెప్పారు. ఎస్‌ఐ రంజిత్‌, కానిస్టేబుళ్లను ఎస్పీ ప్రశంసించారని డీఎస్పీ వెల్లడించారు. అనంతరం నిందితులిద్దరిని రిమాండ్‌కు తరలించారు.

ఎంవీఐ బెదిరించాడని ఆటోడ్రైవర్‌ ఫిర్యాదు

నర్సాపూర్‌: తనపై ఎంవీఐ రిచర్డ్‌ మైయర్‌ చేయిచేసుకోవడమే కాకుండా చంపుతానని బెదిరించాడని ఆటోడ్రైవర్‌ కేతావత్‌ కిరణ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే...శివ్వంపేట మండలం అల్లీపూర్‌తండాకు చెందిన కేతావత్‌ కిరణ్‌ శనివారం ఉదయం ఆటోలో డీజిల్‌ కొట్టించేందుకు నర్సాపూర్‌లోని ఆర్టీసీ పెట్రోలుబంకు బయలుదేరాడు. ఈ క్రమంలోని ఆర్టీఏ అధికారి, సిబ్బంది ఆటో ఆపాలని చెప్పారు. దీంతో పక్కకు తీసి నిలిపేలోపు ఎంవీఐ తన వద్దకు వచ్చి బూతులు తిడుతూ పిడిగుద్దులు గుద్దడంతో పాటు చంపుతానంటూ బెదిరించాడని కిరణ్‌ తన ఫిర్యాదు పేర్కొన్నాడు. అయితే ఈ విషయమై ఎంవీఐ రిచర్డ్‌మైయర్‌ను వివరణ కోరగా, తాను ఎవరినీ కొట్టలేదని, విధినిర్వహణలో భాగంగా వాహనాలను తనిఖీ చేసి సరైన డాక్యుమెంట్లు లేని వాటిపై ఫైన్‌ వేస్తున్నామన్నారు. ఎస్‌ఐ శివకుమార్‌ మాట్లాడుతూ ఆటోడ్రైవర్‌ కేతావత్‌ కిరణ్‌ ఫిర్యాదు అందిందని, దీనిపై విచారణ చేస్తున్నామన్నారు.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్‌

పాపన్నపేట(మెదక్‌): అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్‌తోపాటు జేసీబీని సీజ్‌ చేసినట్టు పాపన్నపేట డిప్యూటీ తహసీల్దార్‌ మధు తెలిపారు. మిన్పూర్‌ శివారులో అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్నట్టు సమాచారం రాగా, వాటిని పట్టుకొని పోలీస్‌ స్టేషన్‌కు తరలించామన్నారు.

సాహిత్య సంపదను కాపాడాల్సిన బాధ్యత రచయితలదే

గజ్వేల్‌రూరల్‌: సాహిత్య సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత కవులు, రచయితలదేనని సకల జనుల రచయితల సంఘం అధ్యక్షుడు కటుకం రాజయ్య అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సకల జనుల రచయితల సంఘం ఆధ్వర్యంలో సామాజిక అంశాలపై ఒక సంకలనం తీసుకురావాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకోసం వివిధ సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేస్తున్న రచయితలు తమకు ఇష్టమైన సాహిత్య ప్రక్రియ(పద్యం, పాట, గేయం, వచన, కవిత)లో 25లైన్లకు మించకుండా పేపర్‌పై లేదా తెలుగులో టైప్‌ చేసి కటుకం రాజయ్య(9441560232), బి.పరమేశ్‌(9390265247)లకు రచయిత పేరు, కలం పేరుతో పాటు పాస్‌ఫొటోతో వాట్సాప్‌ ద్వారా పంపించాలన్నారు. మీ సాహిత్యాన్ని సంకలనం రూపంలో తెచ్చి భవిష్యత్‌ తరాలకు అందుబాటులో ఉంచేందుకు ఈ కార్యాన్ని చేపట్టినట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో ముగ్గురు కనిపించకుండాపోయారు.

కూతురు అదృశ్యమైందని...

పటాన్‌చెరుటౌన్‌: కూతురు కనిపించడం లేదని ఓ తండ్రి ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం ..పట్టణంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన అబ్దుల్లా కుటుంబసభ్యులంతా శుక్రవారంరాత్రి భోజనం చేసి పడుకున్నారు. శనివారం ఉదయం నిద్రలేచి చూసేసరికి కూతురు సుమయ(19) కనిపించలేదు. తెలిసినవారు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి...

తొగుట(దుబ్బాక): ఆడుకునేందుకు వెళ్లిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. మండల పరిధిలోని చందాపూర్‌ గ్రామానికి చెందిన బొడ్డు స్వామి-రజిత దంపతుల కుమారుడు కనకరాజు (15) వెంకట్రావుపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం సాయంత్రం ఆడుకుంటానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రయినా ఆచూకీ తెలియలేదు. బంధువుల ఇంట్లో వెతికినా లాభం లేకపోవడంతో, విద్యార్థి తండ్రి తొగుట పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భర్త కనిపించడం లేదని...


ఈశ్వర్‌(ఫైల్‌)

పటాన్‌చెరుటౌన్‌: ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగిరాలేదంటూ ఓ భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. పటాన్‌చెరు ఎస్‌ఐ పవన్‌ కథనం ప్రకారం.. మండలపరిధిలోని చిట్కుల్‌ వడ్డెర కాలనీకి చెందిన ఈశ్వర్‌ రోజువారీకూలీ. ఈ నెల 13వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య ఎల్లమ్మ భర్త కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తన భర్త అదృశ్యమయ్యాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అదృశ్యమై.. ఆపై శవమై..

పటాన్‌చెరుటౌన్‌: ఇంటినుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి మూడురోజుల తర్వాత మృతదేహమై కనిపించాడు. భానూర్‌-బీడీఎల్‌ ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం..మండలపరిధిలోని నందిగామకు చెందిన శంకర్‌(37) పెయింటర్‌గా, భార్య అండాలు ఓ కళాశాలలో హౌస్‌కీపింగ్‌ చేస్తోంది. పెయింటింగ్‌ కాంట్రాక్ట్‌ చేస్తుండగా, శంకర్‌కు నష్టం వచ్చింది. దీంతో రెండునెలల క్రితం పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స అనంతరం ఇంటివద్దే ఉంటున్నాడు. శంకర్‌ ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం స్కూటీపై ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పటినుంచి నుంచి ఆచూకీ తెలియకపోవడంతో భార్య అండాలు, కుటుంబసభ్యులు వెతుకుతున్నారు. శనివారం గ్రామశివారులోని సొంతవ్యవసాయ భూమి సమీపంలోని మర్రి చెట్టు వద్ద స్కూటీ కనిపించింది. దీంతో పొలం పరిసరాలతో వెతకగా, చున్నీతో ఉరివేసుకున్న ఆనవాళ్లతో శంకర్‌ మృతదేహం కనిపించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య అండాలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పొలంలో పడి..


పొలంలో నర్సమ్మ మృతదేహం

చేగుంట(తూప్రాన్‌): పొలంలో పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్‌ఐ ప్రకాశ్‌గౌడ్‌ తెలిపిన వివరాల ప్రకారం... మండలపరిధిలోని మాసాయిపేటకు చెందిన ఉప్పుల నర్సమ్మ (75) తన కూతురు సుందరమ్మ ఇంటికి ఈనెల14వ తేదీన వెళ్లింది. నాలుగురోజులైనా తనతల్లి తిరిగిరాలేదంటూ కొడుకు దేవదాసు చిన్నశివునూర్‌లోని అక్క ఇంటికి వెళ్లాడు. తల్లి గురించి ఆరా తీయగా, రెండురోజుల క్రితమే వెళ్లిందని చెప్పింది. దీంతో బంధువులకు ఫోన్‌ చేసినా నర్సమ్మ ఆచూకీ దొరకలేదు. శనివారం చిన్నశివునూర్‌కు చెందిన భాగ్యమ్మ వ్యవసాయపొలంలో బోర్లపడి నర్సమ్మ మృతి చెంది ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ప్రమాదవశాత్తు జారి పొలంలో బోర్లా పడి ఊపిరాడక మృతి చెంది ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని నర్సమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కూతురి పెళ్లయిన మరునాడే...

గుండెపోటుతో తల్లి మృతి


భర్తతో కలిసి కన్యాదానం చేస్తున్న స్వరూప(ఫైల్‌)

మద్దూరు(హుస్నాబాద్‌): ఆ ఇంట పెళ్లిసందడి ముగియకముందే చావుబాజా మోగింది. పెద్దకూతురు పెళ్లి జరిగి 24 గంటలు గడవకముందే తల్లి గుండెపోటుతో మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. మద్దూరు మండలంలోని బంజార గ్రామానికి చెందిన జగిలి స్వరూప(35)కు ముగ్గురు కూతుళ్లు. పెద్ద కూతురుకు శుక్రవారం వివాహం జరిగింది. ఇంటిల్లిపాది పెళ్లిసందడిలో ఆనందంగా ఉన్నారు. శనివారం ఉదయం కూతుర్ని అత్తగారింటికి పంపేందుకు ఒకవైపు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతలోనే తల్లి సర్వూప ఒక్కసారిగా గుండెపోటుతో తుది శ్వాస విడిచింది. దీంతో ఒక్కసారిగా పెళ్లింట విషాదఛాయలు నెలకొన్నాయి. పెద్దకూతురికి కన్యాదానం చేసి, చిన్నకూతురుతో తలకొరివి పెట్టించుకుందంటూ కుటుంబసభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

అనుమానంతో హతమార్చాడు

మహిళ హత్యకేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ రమణకుమార్‌


మాట్లాడుతున్న ఎస్పీ రమణకుమార్‌

సంగారెడ్డి టౌన్‌: వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానంతో సహజీవనం చేస్తున్న ఓ మహిళను హతమార్చిన ఘటనలో ఒకరిని అరెస్టు చేశారు. శనివారం మీడియా సమావేశంలో సంగారెడ్డి ఎస్పీ రమణకుమార్‌ ఆ వివరాలు వెల్లడించారు. ఈ నెల 16వ తేదీన మహబూబ్‌సాగర్‌ చెరువులో గుర్తు తెలియని మహిళ శవం గోనెసంచిలో లభ్యమైన విషయం విదితమే. సాంకేతిక ఆధారంగా కేసు దర్యాప్తు చేపట్టారు. బీదర్‌కు చెందిన కవిత(28)కు అదే ప్రాంతానికి చెందిన లక్ష్మణ్‌తో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబకలహాల నేపథ్యంలో భర్తకు దూరంగా ఉంది. బతుకుదెరువు కోసం కవిత సంగారెడ్డికి వచ్చింది. ఈ క్రమంలోనే కోహిర్‌ మండలానికి చెందిన క్షౌ రవృత్తి చేస్తున్న కృష్ణయ్యతో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి సంగారెడ్డిలో ఓ గది అద్దెకు తీసుకొని ఉంటున్నారు. ఈ నెల 12వ తేదీన రాత్రి పదిగంటల సమయం దాటాక కవిత ఇంటికి వచ్చింది. అయితే ఆమె వివాహేతర సంబంధం పెట్టుకుందనే అనుమానం వచ్చింది. దీంతో కృష్ణయ్య ఆమె తలపై గట్టిగా కొట్టగా, స్పృహ తప్పిపడిపోయింది. నేలకు గట్టిగా కొట్టి గొంతు నొక్కి చంపేశాడు. మరునాడు ఉదయం ఒక గోనెసంచి తీసుకొని అందులో చేతులు, కాళ్లు, తల ఒక్కదగ్గర చేసి చున్నీతో కట్టేసి దగ్గర్లో ఉన్న చెరువులో పడేశాడు. శనివారం ఉదయం రూములో పడుకొని ఉన్న కృష్ణయ్యను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో తానే హత్య చేసినట్టు పోలీసులకు తెలిపాడు. ఈ సమావేశంలో డీఎస్పీ రవీందర్‌రెడ్డి, సంగారెడ్డి టౌన్‌ సీఐ శ్రీధర్‌ రెడ్డి పాల్గొన్నారు.

ఎవరికీ ఏ సమాచారం ఇవ్వొద్దు



హుస్నాబాద్‌: గుర్తుతెలియని వ్యక్తులెవరూ ఫోన్‌ చేసినా ఏ సమాచారం ఇవ్వొదని సిద్దిపేట సీపీశ్వేత ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్‌నేరాలపై ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. హుస్నాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని ఒకరికి పాన్‌కార్డు అప్‌డేట్‌ చేసుకోవాలంటూ గుర్తుతెలియని వ్యక్తి ఓ లింక్‌ పంపాడు. బాధితుడు ఆ లింక్‌పై క్లిక్‌ చేయగా, అకౌంట్‌ను రూ.65,700 డెబిట్‌ అయ్యాయి. వెంటనే 1930కి కాల్‌ చేయగా, ఆ డబ్బును ఫ్రీజ్‌ చేశారని సీపీ శ్వేత తెలిపారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

కొండాపూర్‌(సంగారెడ్డి): కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి చెందగా, మరో 18 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కోనాపూర్‌కు చెందిన సంగెం రాములు 40 ఏళ్లుగా గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం కూడా గొర్రెలను మేపిన అనంతరం కొట్టంలోకి తోలాడు. అర్ధరాత్రి దాటాక కుక్కలు గొర్రెల మందపై దాడి చేశాయి. రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్‌ మండల నాయకుడు పడమటి అనంత్‌రెడ్డి సంగెం రాములుకు రూ 20 వేల ఆర్థికసాయం అందజేశారు.

బాకీ డబ్బు ఇవ్వనందుకే హత్య


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ యాదగిరిరెడ్డి

శివ్వంపేట,తూప్రాన్‌: బాకీ డబ్బు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్న నెపంతో వాచ్‌మెన్‌ను హతమార్చిన ఘటనలో ఒకరిని అరెస్టు చేశారు. ఈ నెల 13వ తేదీన శివ్వంపేట మండలం దొంతి కుందాలమ్మ చెరువులో ఆంజనేయులు మృతదేహం వెలుగుచూసిన విషయం తెలిసిందే. మృతదేహంపై గాయాలు ఉండడంతో హత్యగా భావించి కేసు దర్యాప్తు చేశారు. తూప్రాన్‌ డీఎస్పీ యాదగిరిరెడ్డి శనివారం తన కార్యాలయంలో ఆ కేసు వివరాలు వెల్లడించారు. తూప్రాన్‌ మండలం అల్లాపూర్‌ గ్రామానికి చెందిన మన్నే ఆంజనేయులు(45), గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన గుండగళ్ల బాబు పలుచోట్ల కూలీ, వాచ్‌మెన్‌గా పనిచేశారు. ఈ సమయంలో ఇద్దరి మధ్య ఆర్థిక లావాదేవీలు నడిచాయి. బాబు నుంచి రూ.96 వేలు ఆంజనేయులు బాకీగా తీసుకున్నాడు. పలుమార్లు డబ్బు గురించి అడిగినా ఇవ్వలేదు. ఈ నెల 11వ తేదీన దొంతి సమీపంలోని కుందాలమ్మ చెరువు వద్దకు ఇద్దరూ మద్యం సేవించారు. బాకీ డబ్బుల గురించి గొడవ జరిగింది. మద్యంమత్తులో పడిపోయిన ఆంజనేయులు తలపై బాబు బండరాయితో కొట్టి చంపాడు. ఆపై చెరువులో పడేశాడు. అనుమానం రాకుండా మృతుడి సెల్‌ఫోన్‌ నుంచి ఆంజనేయులు కుటుంబ సభ్యులకు ఫోన్‌ చేసి మహిళ గొంతుతో మాట్లాడాడు. ఆంజనేయులును కిడ్నాప్‌ చేశామని డబ్బు, బంగారం ఇవ్వాలని, లేకపోతే చంపేస్తామని హెచ్చరించాడు. ఆంజనేయులు భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. శనివారం ములుగు వద్ద బాబు అదుపులోకి తీసుకొని విచారించగా హత్యకు సంబంధించి వివరాలు చెప్పాడు. గతంలో కూడా బాబుపై పలు కేసులు ఉన్నాయి. ఈ సమావేశంలో సీఐ శ్రీధర్‌, ఎస్‌ఐ రవికాంత్‌రావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు



గాయపడిన బాధితులు


బోల్తా పడిన ఆటో ఇదే

రామాయంపేట(మెదక్‌): ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. పట్టణానికి చెందిన చిరువ్యాపారులు శనివారం సాయంత్రం దౌల్తాబాద్‌ మండల కేంద్రంలో జరిగే సంతకు వెళుతుండగా, ఆటో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. దీంతో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న వీణ, జ్యోతి, రాజు, భరత్‌కుమార్‌, భావన గాయపడ్డారు. వీరిలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరు చిన్నారులు కూడా గాయపడ్డారు. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

గురుకుల ప్రవేశాలకు గడువు పొడిగింపు

పటాన్‌చెరుటౌన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు చిట్కుల్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమోద శనివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశానికి నిర్వహించే వీటీజీ సెట్–2023 దరఖాస్తుల స్వీకరణ గడువును ఈ నెల 16 నుంచి మార్చి 20వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 23వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు.

కామారెడ్డి మెడికల్ కళాశాల ప్రొఫెసర్‌గా డాక్టర్ బన్సీలాల్



నారాయణఖేడ్: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్ (ఆర్థోపెడిక్)గా పనిచేస్తున్న డాక్టర్ బన్సీలాల్‌కు ప్రభుత్వం ప్రొఫెసర్‌గా పదోన్నతిని కల్పించింది. కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రొఫెసర్‌గా నియమిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలో ఆర్థోపెడిక్ విభాగానికి సంబంధించి ఆరుగురు అసోసియేట్ ప్రొఫెసర్లను ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించగా అందులో బన్సీలాల్ ఒకరు. ఈయన స్వస్థలం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం చల్లగిద్ద తండా. మారుమూల తండాలో జన్మించి అంచెలంచెలుగా ఎదిగి ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందడంతో తండా వాసులు హర్షం వ్యక్తం చేశారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం



కేసు విచారిస్తున్న జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.సూరికృష్ణ శనివారం బ్యాంక్ కేసులను పరిష్కరించారు. లోక్ అదాలత్‌లో తొమ్మిది బ్యాంక్ కేసులను పరిష్కరించగా రూ.8,97,500 లక్షలు వసూలయ్యాయి. లోక్ అదాలత్‌లో పలు బ్యాంకుల అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిఫ్‌కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌లో పలు కేసులను జూనియర్ సివిల్ జడ్జి కె.ధనలక్ష్మి పరిష్కరించారు. శనివారం బ్యాంకుకు సంబంధించిన పీఎల్‌సీ కేసును పరిష్కరించారు. ఉత్తర్వులు జారీ చేసి సంబంధీకులకు అందజేశారు. లోక్‌అదాలత్‌లో సీనియర్ న్యాయవాది ఎస్.కృష్ణారెడ్డి, న్యాయవాది నర్సింహులు, లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో పత్తి రైతులు ఆగం

మునిపల్లి(అందోల్): మండలంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పత్తి రైతులు ఆగమవుతున్నారు. గిట్టుబాటు ధర లభించకపోవడంతో నిల్వచేసిన పత్తి వర్షపు నీటికి తడిచిపోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగుకోసం చేసిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

రామచంద్రాపురం(పటాన్ చెరు): కార్మిక సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నీరుడు సాయిలు అన్నారు. శనివారం బెల్ టౌన్ షిప్ లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 26వ తేదీన సంగారెడ్డిలోని టీఎన్జీవో భవనంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా తృతీయ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని కోరారు. బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయిని ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మి, మాధవి, ఆర్.లక్ష్మీ పాల్గొన్నారు.

హజ్ హౌస్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న డీఎండబ్ల్యూఓ అరుణ్‌కుమార్

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలో ప్రారంభించిన హజ్ హౌస్ పనులను శనివారం జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి అరుణ్ కుమార్ పరిశీలించారు. పట్టణంలో మినీ హజ్ హౌస్‌ను నిర్మిస్తున్నారు. నీటి సౌకర్యం కోసం బోరు కూడా వేశారు. పనులను త్వరతగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

బెల్ట్‌షాపు దందాను అరికట్టాలి

- సదాశివపేట మండల సమావేశంలో సభ్యుల డిమాండ్
- ఎంపీపీ తొంట యాదమ్మ అధ్యక్షతన సమావేశం
- సమావేశం ప్రారంభానికి ముందు ఎంపీటీసీ సభ్యులు, అధికారుల మధ్య వాగ్వాదం
- అధికారులు కనీస విలువ ఇవ్వడంలేదని ఆరోపణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తొంట యాదమ్మ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): గ్రామాల్లో అక్రమంగా సాగుతున్న బెల్ట్‌షాపు దందాతో గొడవలు జరుగుతున్నాయని, వాటిని వెంటనే అరికట్టాలని కొల్కూర్ సర్పంచ్ భూపాల్ రెడ్డి, కోనాపూర్ ఎంపీటీసీ అల్లం లలిత సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ తొంట యాదమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు నందికంది ఎంపీటీసీ సభ్యురాలు సునీతసుధాకర్ ఎంపీడీఓ పూజ, ఎంపీఓ నారాయణ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామాల్లో ఎంపీటీసీ సభ్యులకు అధికారులు కనీస విలువ ఇవ్వడం లేదని, తమను పట్టించుకోవడం వాపోయారు. సమావేశాన్ని బాయికాట్ చేస్తామని నందికంది ఎంపీటీసీ సభ్యురాలు తెలపడంతో ఎంపీడీఓ పూజ వారితో తన కార్యాలయంలో చర్చలు జరిపారు. తమకు సభ్యులపై గౌరవం ఉందని, సమావేశానికి రావాలని ఆమె కోరడంతో సమావేశాన్ని కొనసాగించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని పలువురు సర్పంచ్‌లు అధికారుల దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు బదులిచ్చారు. సభ్యులు రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కోరగా తన దృష్టికి సమస్యలను తెస్తే వెంటనే పరిష్కరిస్తానని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి సభ్యులకు సమాధానమిచ్చారు. గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతోందని, ప్రజలు సద్వినియోగం చేసుకొనేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని సంబంధిత అధికారులు కోరారు. గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించేలా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో చేపట్టే అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఇందిరా క్రాంతి, ఉపాధి హామీ తదితర శాఖలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో మండల కోఆప్షన్ మెంబర్ ఖలీల్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో గిరిజనుల అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో సాగుతున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అన్ని తండాలలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్, జగదాంబ మాత దేవాలయాల నిర్మాణాలు పూర్తి చేస్తున్నామన్నారు. అమీన్‌పూర్ మండల పరిధిలోని ఐలాపూర్ తండాలో నూతనంగా నిర్మించిన సంత శ్రీ సేవాలాల్ మహారాజ్, జగదంబ మాత దేవాలయాల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తండాలను గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడంతో పాటు రాజకీయరంగంలోనూ రిజర్వేషన్లు కల్పించి పరిపాలనలో భాగస్వాములు చేసిన మహోన్నత నాయకుడు కేసీఆర్ అన్నారు. నియోజకవర్గంలోనూ గిరిజనుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ మాధవి రవి నాయక్, కిష్టారెడ్డిపేట గ్రామ సర్పంచ్ కృష్ణ, సీనియర్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

ఆలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

పటాన్‌చెరు: నియోజకవర్గంలో నూతన దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రూపా శ్రీకౌంటీ కాలనీ ఎదురుగా నూతనంగా నిర్మించ తలపెట్టిన శ్రీశ్రీశ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, అష్టలక్ష్మీ దేవాలయ నిర్మాణాలకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగా రెడ్డి, కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కల్పన ఉపేందర్ రెడ్డి, బోయిని బాలమణి బాలరాజు, నవనీత జగదీశ్, బిజిలి రాజు, బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బాల్ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తలారి రాములు, యునుస్, సీనియర్ నాయకులు చంద్రశేఖర్, మహిపాల్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళా సంఘం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత

హత్నూర(సంగారెడ్డి): మండల కేంద్రమైన హత్నూరలో గ్రామైక్య మహిళా సంఘం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం చేపట్టిన కార్యక్రమంలో సీసీ మహేష్ మాట్లాడారు. గ్రామాల పరిశుభ్రతకు ప్రతీ ఒక్కరు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వీఓఏ లక్ష్మయ్య, మహిళా సంఘం సభ్యురాలు సంధ్య, వెంకటమ్మ, సరిత, సోనీ, ఆబేద, పద్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు నర్సింహులు

కంది(సంగారెడ్డి): కబ్జా చేసిన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం మండల కేంద్రమైన కందిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ కందిలోని సర్వే నంబర్ 460 నుంచి 615 లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమిని కొందరు కబ్జా చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కబ్జాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించాలి

ఎంపీపీ కొంగరిజయశ్రీ



మాట్లాడుతున్న ఎంపీపీ కొంగరి జయశ్రీ

మనూరు(నారాయణఖేడ్): అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎంపీపీ కొంగరిజయశ్రీ అన్నారు. శనివారం మనూరు మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చెయాలని ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పుల్‌కుర్తి, అతిమ్యాల్ గ్రామాలకు మిషన్ భగీరథ తాగునీరు రావడంలేదని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఎంపీపీ ఉపాధ్యక్షులు రాములు, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓ షాజిలొద్దీన్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిషన్ అంత్యోదయపై గ్రామసభ



మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని చీకుమద్దూర్ గ్రామంలో మిషన్ అంత్యోదయపై గ్రామసభ శనివారం నిర్వహించారు. సర్పంచ్ వీరన్నగారి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మిషన్ అంత్యోదయ పై ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. సమావేశంలో గ్రామంలో మౌలిక సదుపాయాలు, సేవలు, వ్యవసాయం అనుబంధ రంగాలు, పశుసంరక్షణ, మత్స్య సంపద, నీటి సరఫరా, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, రోడ్లు, కమ్యూనికేషన్, ప్రజా పంపిణీ వ్యవస్థ, విద్య, వృత్తి విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పేదరిక నిర్మూలన కార్యక్రమం బడుగు బలహీన వర్గాల సంబంధించిన అంశాలపై ప్రజలకు వివరించారు. సంక్షేమం, ఖాదీ, కుటీర పరిశ్రమలు, చిన్న తరహా పరిశ్రమలు తదితర అంశాలపై సమావేశం నిర్వహించి చర్చించిన తదనంతరం ఆమోదించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి రాజేందర్ రెడ్డి, వార్డు మెంబర్లు యశోద, హుస్సేన్ సాబ్, నాగేశ్, జ్యోతి, కిషన్, కో ఆప్షన్ మెంబర్లు సుభాన్ రెడ్డి, శ్రీనివాస్, మాజీ సర్పంచ్ పాట్టి శ్రీశైలం, ఆత్మ కమిటీ డైరెక్టర్ పోశెట్టి, సీఏ కిష్టయ్య, స్థానికులు మల్లేశం నాగేష్ యాదయ్య నర్సారెడ్డి రాములు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కమిటీ ఎన్నిక



సభ్యులతో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యదవ్

పటాన్‌చెరుటౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని పాస్టర్స్ ఫెలోషిప్ అసోషియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు అసోషియేషన్ అధ్యక్షుడు యాదయ్య(జాషువా) శనివారం తెలిపారు. నూతన కమిటీ ఉపాధ్యక్షుడిగా డేవిడ్ రాజ్, జనరల్ సెక్రటరీ ప్రసాద్, జాయింట్ సెక్రటరీ ప్రభుదాస్, ట్రెజరర్‌లుగా మోజెస్, ప్రభాకర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ రత్నపాల్, కమిటీ సభ్యులుగా యేసయ్య, ఏసుపాదంను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నిక అనంతరం పటాన్‌చెరు కార్పొరేటర్‌ను మర్యాద పూర్వకరంగా కలిశారు. ఎన్నికైన కమిటీ సభ్యులను కార్పొరేటర్ సన్మానించి, శుభకాంక్షలు తెలిపారు. పాస్టర్స్ అసోసియేషన్ కు తనవంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన జిన్నారంలో మహిళలు, యువతులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఉచిత కుట్టుమిషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి శనివారం సర్టిఫికెట్ల ప్రదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, ఆయన సతీమణి యాదమ్మ మహిళలు, యువతులకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కుట్టుమిషన్‌ను నేర్చుకున్న ప్రతీ మహిళకు మిషన్‌ను ఉచితంగా అందిస్తానన్నారు.

హనుమాన్ దేవాలయ కమిటీ నూతన కార్యవర్గం



హనుమాన్ మందిర కమిటీ నూతన కార్యవర్గం

జహీరాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్ హనుమాన్ దేవాలయం కమిటీ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆలయం నూతన కమిటీ అధ్యక్షుడిగా రాములు నేత, ప్రధాన కార్యదర్శిగా తులసిదాస్ గుప్తా, గౌరవ అధ్యక్షులుగా సంగం అంజయ్య, జనార్దన్ దేశ్‌పాండే, ఉపాధ్యక్షులుగా గన్నారం సుభాష్, నాగన్న యాదవ్, వెంకటేశం, శేఖర్, సహయ కార్యదర్శులుగా గాజుల మోహన్, వెంకట్‌సాగర్, శ్రీధర్, పల్లె ప్రవీణ్, కోశాధికారిగా భరత్‌లాల్ ఓజా, న్యాయసలహాదారులుగా మాశెట్టి జగదీశ్, విశ్వనాథ్ స్వామి, సాంస్కృతిక కార్యదర్శిగా కృష్ణాచారి, సభ్యులుగా ధన్నారం బస్వరాజ్, మాణిక్‌ప్రభు, సత్యనారాయణరెడ్డి, విజయ్‌కుమార్, అయ్యప్పరెడ్డి, గొల్లనాగన్నలు ఏకగ్రీవంగా ఎనికయ్యారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య



ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): మండలంలోని భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపూర్ మండలంలోని మాందాపూర్, మునిదేవునిపల్లి, కుతుబ్‌షాహీపేట గ్రామాల రైతులు కొన్ని సంవత్సరాలుగా అసైన్డ్ భూములను సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూ ప్రక్షాళన పేరుతో ఆ భూములకు సంబంధించి పుస్తకాలను ధరణిలో లేకుండా చేశారన్నారు. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నా పరిష్కారం కావడం లేదన్నారు. వెంటనే ఆ సమస్యను పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు యాదవ రెడ్డి, జిల్లా నాయకులు మాణిక్ రెడ్డి, రాములు, గోపాల్, అమృతమ్మ, సుశీల, చంద్రమ్మ, మాణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వికాస తరంగణి చీఫ్ కోఆర్డినేటర్‌గా అల్లాడి వీరేశం

జహీరాబాద్ టౌన్: వికాస తరంగణి జహీరాబాద్ శాఖ నూతన కమిటీని చిన్న జీయర్ స్వామి ఏర్పాటు చేశారని నిర్వాహకులు తెలిపారు. జహీరాబాద్ వికాస తరంగణి చీఫ్ కోఆర్డినేటర్‌గా ప్రముఖ వ్యాపార వేత్త అల్లాడి వీరేశం, గౌరవ అధ్యక్షుడిగా సాయిరెడ్డి విఠల్‌రెడ్డి, ప్రజా సంబంధాల సమన్వయకర్తగా ఉమామహేశ్వర్‌రావు, ప్రజ్ఞ సమన్వయకర్తగా సౌందర్‌పల్లి విజయలక్ష్మి, యువ వికాస్ సమన్వయకర్తగా చిటుకల శ్రీవాణి, ఆరోగ్య వికాస్ సమన్వయకర్తగా డాక్టర్ శేషు పద్మనాభరావు, కోశాధికారిగా బెజుగం సంధ్యారాణిని నియమించారు.

సంక్షిప్త వార్తలు

◆ వెంకటాచల దివ్య క్షేత్రంలో పూజలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): భక్తుల గోవింద నామస్మరణ మధ్య మండల పరిధిలోని వెంకటాపూర్ శివారులో గల వెంకట చల దివ్య క్షేత్రంలో ప్రత్యేక పూజలు జరిగాయి. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల, సదాశివపేట పట్టణ ప్రజలు స్వామివారిని దర్శించుకొని మొక్కులను చెల్లించుకున్నా రు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిల్వేరి వెంకటేశం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ నష్టపరిహారం మంజూరు చేయాలి

మునిపల్లి(అందోల్): ఇటీవల పడిన వడగళ్ల వర్షం కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం మంజూరుచేసి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దలోడి బస్వరాజ్ పటేల్ సంబంధిత అధికారులను కోరారు. శనివారం వడగళ్ల వర్షంతో మామిడి, జామ, టమాటా, ఉల్లిగడ్డ తదితర పంటలతో దిగుబడి సాధించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలనుకున్న రైతులకు వడగళ్ల వర్షం తీవ్ర నష్టం మిగిల్చిందన్నారు. పంట దిగుబడి కోసం తెచ్చిన అప్పులు పెరిగిపోతున్నాయని వారు ఆందోళన చెందుతున్నారన్నారు.

◆ టెన్త్ విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ పంపిణీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని తంగడపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్స్ కరుణం రాజేశ్వర్ జ్ఞాపకార్థం వారి కుమారుడు కరుణం సందీప్ శనివారం పంపిణీ చేశారు. ఉగాది అనంతరం పాఠశాలకు కంప్యూటర్స్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ సక్కరి సంగమేశ్వర్, నాయకులు అమ్రాడి రాజు, శేఖర్, పెంటరెడ్డి, నవీన్, ఆంజనేయులు, బంధయ్య, భరత్, కామల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం నాగుల్దేవులపల్లి గ్రామంలో సీతారాముడి ఆలయ నిర్మిస్తున్నట్లు సర్పంచ్ సుధాకర్ తెలిపారు. శనివారం ఆలయ నిర్మాణం కోసం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించినట్లు చెప్పారు. గ్రామస్తులు, భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.

◆ ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ వెనుకగల హనుమాన్‌నగర్ కాలనీ శివపంచముఖి ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం దుర్గాభవానీ మందిరం నుంచి మంగళవాయిద్యాలతో శివపంచముఖి ఆంజనేయస్వామి మందిరం వరకు మహిళలు సామూహిక కళశాల ఊరేగింపు నిర్వహించారు.

◆ పేద కుటుంబానికి చేయూత

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం సాధులనగర్ గ్రామానికి చెందిన మంగపురం పోచయ్య దౌల్తాబాద్‌లో నివాసం ఉంటున్నారు. రెండు రోజుల క్రితం అతడి పూరిగుడిసె ప్రమాదవశాత్తు కాలిపోయింది. శనివారం గమ్యం ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఆశ్రయించాడు. గమ్యం ఫౌండేషన్ చైర్మన్ బక్కన్నగారి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పది రోజులకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేసినట్లు బాధితుడు తెలిపాడు. కార్యక్రమంలో గమ్యం సభ్యులు భిక్షపతిగౌడ్, సాయి ప్రసాద్, గౌస్ పాల్గొన్నారు.

◆ నేడు సీపీఐ బహిరంగ సభ

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని సుభాశ్ గంజ్‌లో ఆదివారం సీపీఐ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు డివిజన్ కార్యదర్శి నర్సింహులు తెలిపారు. బహిరంగ సభకు జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే బహిరంగ సభకు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ వీరభద్ర స్వామికి ప్రత్యేక పూజలు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని అంగడిపేట భద్రకాళి సహిత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సంగారెడ్డి అసెంబ్లీ ఇన్‌చార్జి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేశ్వరరావు దేశ్ పాండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంగారెడ్డి బీజేపీ మండల అధ్యక్షుడు పాపన్న, సంగారెడ్డి కౌన్సిలర్ మందుల నాగరాజు, పార్టీ కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ సీసీ రోడ్ల పనులు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలోని ప్రధాన కూడలి నుంచి మల్లికార్జున స్వామి దేవాలయానికి సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. శనివారం ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చొరవతో సుమారు రూ.30లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, నాయకులు శ్రీనివాస్, ఫయాజ్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మునిపల్లి(అందోల్): మండలంలోని పొల్కంపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. శనివారం జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సహకారంతో గ్రామాల్లో ప్రగతి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, పంచాయతీ కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

◆ స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలి

జిన్నారం(పటాన్‌చెరు): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విషయంలో స్వచ్ఛతపై అవగాహన కలిగి ఉండాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కౌన్సిలర్ చంద్రారెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా కాలనీలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా బొల్లారం మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ బొల్లారం మున్సిపాలిటీలోని అన్ని కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవటంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

◆ శ్లాబ్ పనులు ప్రారంభం

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణంలోని విశిష్ట చరిత్రగల శ్రీరామమందిరం పునః నిర్మాణంలో భాగంగా దాతల సహకారంతో నిర్మిస్తున్న కల్యాణమండప శ్లాబ్ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. దాత జెడ్పీ ప్రణాళికా సంఘం మాజీ సభ్యుడు నగేశ్ షెట్కార్ పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు ముత్యపు హన్మాండ్లు, పాండు, కాంగ్రెస్ నాయకులు సాయిలు పటేల్, పండరినాథ్, నెహ్రూనాయక్, మాణిక్‌రావు, గుత్తి రమేశ్, బస్వరాజ్ పాల్గొన్నారు.

◆ ఘనంగా ఆలయ ప్రథమ వార్షికోత్సవం

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ వెనుకగల హనుమాన్‌నగర్ కాలనీ శివపంచముఖి ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం దుర్గాభవానీ మందిరం నుంచి మంగళవాయిద్యాలతో శివపంచముఖి ఆంజనేయస్వామి మందిరం వరకు మహిళలు సామూహిక కళశాల ఊరేగింపు నిర్వహించారు.

◆ ఇంటికే భద్రాద్రి రామయ్య తలంబ్రాలు

నారాయణఖేడ్: శ్రీరామ నవమిని పురస్కరించుకొని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ ముత్యాల తలంబ్రాల కోసం రూ.116 చెల్లించి బుక్ చేసుకున్న వారికి ఇంటివద్దకే తలంబ్రాలు అందించే ఏర్పాట్లు చేశామని ఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శనివారం బస్టాండ్ ఆవరణలో బుకింగ్ కౌంటర్‌ను ప్రారంభించారు. బుక్ చేసుకున్న పలువురికి రసీదులు అందజేశారు. తలంబ్రాల కోసం బుకింగ్ కౌంటర్‌లో బుక్ చేసుకోవచ్చని, లేదా మార్కెటింగ్ సెల్ ఇన్‌చార్జి పాండు (94410 71134)ను సంప్రదించాలని సూచించారు.